క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.56,396 విరాళం



అంతర్వేది ఆలయంలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న రవికిరణ్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు సఖినేటిపల్లికి చెందిన కొప్పర్తి రవికిరణ్, సాయిశ్రీజ దంపతులు రూ.56,396 విరాళం బుధవారం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. ఈ మేరకు దాతకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారు. చింతా నరసింహ స్వామి పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.11 వేల విరాళం



దాత కుటుంబానికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు విశాఖపట్నానికి చెందిన కాట్రేనిపాడు సత్యనారాయణ స్మారకార్థం అతని కుటుంబ సభ్యులు బుధవారం రూ.11,116 విరాళంగా అందించారు. సత్యనారాయణ భార్య కాట్రేనిపాడు వీరవేణి ఆమె కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దాత కుటుంబానికి ఆలయ ఉద్యోగులు, అర్చకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

యోగాలో విద్యార్థులకు ఉచిత శిక్షణ



యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మామిడికుదురు: భీమ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మామిడికుదురులో బుధవారం యోగా శిక్షణనిస్తున్నారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయి. యోగా గురువు పోతుల జయప్రకాష్ (పీఈటీ) ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ క్లాసులతో పాటు మానసిన ఉల్లాసం కోసం యోగాలో పలు అంశాలను వివరించారు. 3వ తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు ఈ ఉచిత శిక్షణా తరగతుల్లో పాల్గొంటున్నారని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు తెలిపారు.

సుధా మాధురికి డాక్టరేట్



సుధా మాధురికి డాక్టరేట్‌ను అందిస్తున్న ఉపకులపతి ప్రసాదరెడ్డి

మలికిపురం: రామరాజులంకకు చెందిన సుధామాధురికి ఏయూ డాక్టరేట్‌ను అందించింది. ఆమె ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగపు పరిశోధక విభాగంలో చదువుకుంది. ఆచార్య టి.షారోన్ రాజు పర్యవేక్షణలో విశాఖపట్నం జిల్లాలో మాధ్యమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన శైలులు, జీవశాస్త్రంలో వారి ఆసక్తి, విద్యార్థులు సాధించిన విజయాల్లు అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఈ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆయన కార్యాలయంలో సుధా మాధురికి డాక్టరేట్ పట్టాను అందించి, అభినందించారు.

సరుగుడు తోటలు దగ్ధం

మలికిపురం: శంకరగుప్తంలోని సముద్ర తీరం ఎస్సీ సొసైటీ భూములలో సరుగుడు తోటలు బుధవారం దగ్ధమయ్యాయి. ఎండల తీవ్రత కారణంగా మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు. సొసైటీ అధ్యక్షుడు చింతా కుమారరాజు అప్రమత్తమై రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. రెండెకరాలలో సరుగుడు తోటలు దగ్ధమైనట్టు అంచనా వేశారు. సుమరు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం ఉంటుంది.

తలుపు తట్టి.. నాడి పట్టి..

- పేదల ఇంటి ముంగిటకు వైద్యం
- గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- ఉత్తమ సేవలందిస్తున్న వైద్య బృందాలు



పినపళ్లలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి సాయికిశోర్

ఆలమూరు: రాష్ట్రంలోని పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యం లేకుండా అందరికీ సంపూర్ణంగా వైద్య సేవలను అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) చేపట్టింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని విధాలుగా అప్పటి వైద్య వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఎఫ్‌డీపీ పథకం గ్రామీణులకు మరింత చేరువైంది. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన 104 వాహనంలో వైద్యాధికారితో కూడిన వైద్యారోగ్య బృందం ప్రతి నెలా రెండుసార్లు గ్రామానికి వెళ్లి సేవలను అందిస్తున్నారు. ప్రత్యేకమైన వైద్య పరికరాలతో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగానే అందజేస్తున్నారు. ఎఫ్‌డీపీలో దొరకని ఖరీదైన మందులను ప్రత్యేక వ్యవస్థ ద్వారా రోగి ఇంటికే మందులను తీసుకువస్తున్నారు. స్థానిక వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సేవలను అందిస్తున్నారు. అలాగే భోజన విరామం తరువాత సాయంత్రం వరకూ మంచానికే పరిమితమై నడవలేని స్థితిలో ఉన్న రోగుల ఇంటివద్దకు వెళ్లి మరీ చికిత్స అందజేస్తారు.

గతంలో కంటే భిన్నంగా వైద్య సేవలు

గత టీడీపీ హయాంలో కంటే పూర్తి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వంలో వైద్య సేవలను అందుతున్నాయి. గతంలో పీహెచ్‌సీల్లో సరైన వైద్యారోగ్య సిబ్బంది, మందులు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు. గ్రామానికి సుదూరంగా ఉన్న ఆస్పత్రికి వెళితే అక్కడ వైద్యాధికారి పరీక్షలు నిర్వహించే వరకూ ఓపికతో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడేది. దీంతో చిన్న చిన్న రోగాలకు సైతం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే పరిస్థితులను గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొనేడివారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్యారోగ్య రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. దీనిలో భాగంగానే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎఫ్‌డీపీ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానంలో అనారోగ్యంతో అవస్థలు పడుతున్న రోగి ఇంటి వద్దకే వైద్యులు వచ్చి సేవలందిస్తున్న విధానానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది.

పేదలకు ఆసరాగా..

క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని 242 గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు పేద ప్రజలకు సేవలను అందిస్తున్నాయి. గ్రామాల్లో ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో సుమారు 70 శాతం క్లినిక్‌లు సొంత భవనాలు సమకూర్చుకోగా మిగతా క్లినిక్‌లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ప్రతి క్లినిక్‌లో ప్రజలకు ఎళ్లవేలలా అందుబాటులో ఉండేలా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను(ఎంఎల్‌హెచ్‌పీ) నియమించి వైద్య పరికరాలను దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే అవస్థలు తప్పడంతో పాటు ఆర్థిక భారం తప్పిందని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఊరిలోనే వైద్యం



ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చాం. చిన్న చిన్న రోగాలకు పెద్ద ఆస్పత్రులకు వెళ్లకుండా స్థానికంగానే చికిత్సను అందిస్తున్నాం. మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నాం. రాలేని వారికి ఇంటి వెళ్లి మరీ సిబ్బంది సేలందిస్తున్నారు.

– వి.సువర్చల, ఎంఎల్‌హెచ్‌పీ, చింతలూరు

ఎంతో ఇబ్బంది పడేవాళ్లం



ఫ్యామిలీ డాక్టర్ పొగ్రాం ద్వారా గ్రామాల్లోకి వచ్చి ఇంటి వద్దనే సేవల అందిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేక ఇబ్బంది పడేవాళ్లం. అలాంటి వారికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఎంతో మేలు చేస్తోంది. టీడీపీ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే డాక్టర్ కోసం రోజంతా పడిగాపులు పడాల్సిన దుస్థితి తమకు తప్పిందని పేదలంటున్నారు.

– పోలిశెట్టి రత్నం, పెనికేరు

మెరుగైన సేవలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలందరికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. మా గ్రామానికి 104 వాహనం పంపించి అందరికీ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో మంచంపై నుంచి లేవలేని రోగులను సైతం గుర్తించి ఇంటి వద్దకే వచ్చి వైద్యం చేస్తుండడం అభినందనీయం.

– మట్టపర్తి సత్యనారాయణ, సూర్యారావుపేట

రామాలయం అభివృద్ధికి రూ 1.08 లక్షల విరాళం



పెదపళ్లలో దాత పాపారావుకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల తూర్పు వీధి రామాలయం అభివృద్ధికి ప్రముఖ పారిశ్రామిక వేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు రూ.1.08 లక్షలు విరాళంగా అందించారు. గ్రామంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆరామాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి భక్తిభావాన్ని మరింత ఇనుమడింపజేయాలని ఆయన ఆలయ కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నెక్కంటి వెంకట్రాయుడు, అల్లూరి సత్యనారాయణ, నామాల రుద్రయ్యచౌదరి ఆధ్వర్యంలో గ్రామస్తులు దాత పాపారావును ఘనంగా సత్కరించి శ్రీహనుమత్ లక్ష్మణ సమేత శ్రీ సీతారామచంద్రమూర్తి ఫోటోను బహుకరించారు.

వ్యక్తి అదృశ్యం

పి.గన్నవరం: వ్యక్తి అదృశ్యంపై పి.గన్నవరం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండలం ఏనుగుల మహాల్‌కు చెందిన కుంచె రాజకుమార్(28) రావులపాలెం ఆర్టీసీ డిపోలో ప్రైవేటు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన యువతితో గతంలో వివాహం జరుగగా ఆమె మరణించింది. దీంతో రెండేళ్ల క్రితం మరొక యువతితో రాజ్‌కుమార్‌కు వివాహం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఈనెల 27న మొదటి భార్య తల్లికి చెందిన మోటారు సైకిల్‌ను ఇవ్వడానికి పోతవరం వెళ్లాడు. అక్కడ మోటారుసైకిల్‌ను ఇచ్చి ఇంటికి తిరిగి చేరుకోలేదని ఎస్సై వివరించారు. ఈ మేరకు అతని తమ్ముడు కుంచె అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మి పోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

రేపు రాజోలు నియోజకవర్గంలో..

రాజోలు: నియోజకవర్గ పరిధిలోని 132/33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోన్ని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఎందుకు వచ్చారో.. వెళ్లారో..

- తూతూమంత్రంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం
- మెల్లగా జారుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



అంబాజీపేటలో అధికారుల పత్రాన్ని చదువుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు వచ్చారో.. వెళ్లారో వారికే అర్థం కాలేదు. భారత ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, దానికి లోబడి సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. ఏ విధమైన శాఖాపరమైన సమీక్షలు గాని, తీర్మానాలు గానీ చేయకుండా సమావేశాలను జరిపించుకోవచ్చు. కానీ దానిని సాకుగా చూపి సమావేశాన్ని తూతూ మంత్రంగా ముగించేశారు. సమావేశంలో ఏ విధమైన సమీక్షలు లేని కారణంగా సభకు వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులతో ఎంపీడీఓ వరలక్ష్మి సంతకాలు తీసుకున్నారు. దాంతో ప్రజాప్రతినిధులు ఎంపీపీ గదిలోకి వచ్చేశారు. సమావేశాన్ని ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో ఎందుకు జరపలేకపోతున్నామని, అధికారుల నుంచి వచ్చిన పత్రాన్ని చదివి వినిపించాలని వారు ఎదురు చూస్తున్నారని ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులను కోరారు. ప్రజాప్రతినిధులు మరోసారి సమావేశానికి హాజరై ఎన్నికల నియమావళికి లోబడి సమావేశాన్ని నిర్వహించాల్సి ఉందని చదివి వినిపించారు. అప్పటికే అధికారులు అక్కడి నుంచి జారుకున్నారు. ఇదిలా ఉండగా సర్వసభ్య సమావేశానికి ఎప్పుడు హాజరుకాని కొంత మంది అధికారులు పనికట్టుకుని మరీ వచ్చారు. కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ఎవ్వరూ ప్రశ్నించరు, త్వరగా సమావేశం నుంచి బయటకు వెళ్లిపోవచ్చని ఉత్సాహంగా వచ్చారంటూ ప్రజాప్రతినిధులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఈఓపీఆర్డీ బి.మమత తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సమావేశానికి హాజరు కాగా అప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లిపోవడంతో వెనుదిరిగారు.

108లో ప్రసవం



చెముడులంక వద్ద 108 వాహనంలో ప్రసవించిన తల్లీ బిడ్డతో సిబ్బంది

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరుకు చెందిన ఎస్.సుశీల(28) మంగళవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనంలో ఆసుపత్రి వెళుతుండగా మార్గం మధ్యలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలలోకి వెళితే స్థానిక పెద్ద కాలువ రోడ్డులోని ఒక ఇటుక బట్టీలో పనిచేస్తున్న సుశీలకు మంగళవారం రాత్రి పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో సహచర కార్మికులు, కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆ ఆస్పత్రిలో కొంత సమయానికి అందుబాటులోకి వచ్చిన వైద్యాధికారులు గర్భిణీని పరీక్షించి పరిస్థితి క్లిష్టంగా ఉందని మెరుగైన వైద్యం అందించాలంటూ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి సిఫారసు చేశారు. ఆమె అక్కడ నుంచి 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళుతుండగా చెముడులంక దాటే సరికి పురిటి నొప్పులు మళ్లీ ఎక్కువవడంతో ఈఎంటీ డీవీవీ రమణ, పైలట్ కె.శ్రీపాతీ చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేయించారు. అనంతరం తల్లి, బిడ్డను కడియం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అక్కడ వారిద్దరూ క్షేమంగా ఆరోగ్యకరంగా ఉన్నట్టు 108 వాహన సిబ్బంది తెలిపారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

స్థానిక సీహెచ్‌సీకి ప్రసవం కోసం తీసుకువచ్చిన గర్భిణి సుశీలకు సత్వర చికిత్సను అందించలేదంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. 108 వాహనంలో ప్రవసం చేసిన సిబ్బంది మాదిరిగానే అన్ని వనరులు అందుబాటులో ఉండే ఆస్పత్రిలో ఎందుకు చేయించలేదంటూ ప్రశ్నించారు. దీనిపై సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి వి.గోపిరామ్‌ను వివరణ కోరగా గర్భిణికి నెలలు పూర్తిగా నిండకపోవడంతో పాటు రక్తపోటు, రక్తహీనత అధికంగా ఉండడం వల్ల ముందస్తు జాగ్రత్త గా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం సిఫారసు చేశామన్నారు. గర్భిణులతో పాటు పుట్టబోయే బిడ్డల క్షేమం దృష్ట్యా సుఖం ప్రసవం జరిపేందుకు ఒక్కొక్కసారి సిఫారసు చేయక తప్పనసరి అని ఆయన పేర్కొన్నారు.

చాలీసా పారాయణను విజయవంతం చేయండి

విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం



హనుమాన్ చాలీసా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుబ్రహ్మణ్యం

మలికిపురం: హనుమత్ జయంతి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చేనెల 2వ తేదీన ఉదయం 8 గంటల నుంచి అమలాపురం కాపు కల్యాణ మండపంలో ప్రారంభమయ్యే సహస్ర హనుమాన్ చాలీసా పారాయణను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, టీటీడీ ధార్మిక మండలి సభ్యులు గువ్వల నాగరాజు కోరారు. మలికిపురంలో ఇందుకూరి అచ్యుతరామరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సీతారామాంజనేయస్వామి వారి పూజారి కార్యక్రమాలతో స్వామీజీల అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. అనంతరం వెయ్యి మంది భక్తులతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం 11 పర్యాయాలు చేస్తామన్నారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ దేశ వ్యాప్తంగా చేస్తున్న ఈ మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి, అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాస నగేష్, అడబాల రాంబాబు, చంపాటి శివరామకష్ణంరాజు, కాపిశెట్టి కనకేశ్వరరావు, పట్టపు సూర్యప్రకాశరావు, ఇందుకూరి సుబ్బరాజు, అడబాల నరసింహారావు, పెచ్చెట్టి మురళీమోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య



తాగునీటి సమస్యపై బిందెలతో స్థానికుల నిరసన

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలోని గెడ్డం వారిపేటలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దాన్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నెల రోజుల నుంచి ఈ సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ఈ సమస్యపై స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, సర్పంచ్ సుందరనీడి చిన్ని మాట్లాడుతూ గెడ్డంవారిపేటకు ట్యాంకురు ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

పట్టెడన్నం కోసం ఎన్ని పాట్లో..



అంబాజీపేటలో సర్కస్ ఫీట్లు చేస్తున్న చిన్నారులు

అంబాజీపేట: కూటికోసం కోటి విద్యలు అన్నారు మన పెద్దలు. నిజమే పట్టెడన్నం కోసం ఆ చిన్నారులు ఎన్నో సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. వీరి చేసే సర్కస్ ఫీట్లే ఆ కుటుంబం కడుపు నింపుతోంది. వివరాలలోకి వెళితే.. సంచార జాతులకు చెందిన చిన్నారులు బుజ్జి, ఆకసా, అబ్రిల్‌లు తల్లి మీనాతో కలిసి అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో నివాసముంటున్నారు. బొందిలి బాష మాట్లాడే వీరు ఊరూరా తిరుగుతూ సర్కస్ ఫీట్లు చేస్తూ వచ్చే డబ్బులతో జీవనం సాగుస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో కుటుంబానికి ఆసరగా ఉంటున్నారు. అయితే కొంతమంది ఆ చిన్నారుల ప్రతిభను ఆసక్తిగా చూస్తున్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న సీఆర్‌సీ కార్యవర్గం సభ్యులు

రావులపాలెం: జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులను బుధవారం సీఆర్‌సీలో జరిగిన కార్యక్రమంలో కార్యవర్గం సభ్యులు అభినందిచారు. ఈనెల 22 నుంచి 27 వరకూ మహారాష్ట్ర పూణేలో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో మండలంలోని కొమరాజులంక గ్రామానికి చెందిన శాన్విరెడ్డి బాలికల 40 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించగా, అదే గ్రామానికి చెందిన కర్రి జిత్విన్ సూర్య, రెడ్డి బాయ్స్ 30 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్టు కోచ్ టి.వెంకటలక్ష్మి తెలిపారు. మెడల్స్ సాధించిన విజేతలను స్థానిక కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్(సీఆర్‌సీ) ప్రెసిడెంట్ తాడి నాగ మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగమోహన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు సీఆర్‌సీ ఎప్పుడూ ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు.